# కొత్త చీర

- బి.శ్రీప్రసాద్

"ఏమండీ! ఈసారి పండక్కి నాకు కొత్త చీర కొనక్కర్లేదు. మీరూ, పిల్లలు తెచ్చుకోండి చాలు" అని మా ఆవిడ అనేసరికి నాకు చచ్చేంత ఆశ్చర్యం వేసింది.

ఆ మాటలన్నది మా ఆవిడేనా? అనే అనుమానం వేసి అటు తిరిగి మా ఆవిడవైపు చూసాను. 'నేనే'నన్నట్లు చిరునవ్వుతో చూసింది. నా చెవులు నన్నేం మోసం చేయడం లేదుకదా అన్న సంశయం కూడా వేసింది.

అసలు నేను కలగనడంలేదు కదా... అనుకుని ఓసారి గిల్లి చూసుకున్నాను. గిల్లుకున్నచోట చురుక్కుమంది. అంటే నేను కలేం కనడంలేదన్నమాట.

"కాంతం... ఆ మాట అన్నది నువ్వేనా?" ఆశ్చర్యంగా మొహం పెట్టి అన్నాను.

"అక్షరాలా నేనే..." చిరునవ్వు నవ్వింది.

"ఈ మాటలో మరలా మార్పేమీ ఉండబోదు కదా"

"ఎందుకండీ అంత అనుమానం. నేనొకసారి నిర్ణయించుకున్నానంటే ఇక ఆ నిర్ణయంలో ఎటువంటి మార్పులూ ఉండవు" స్థిరంగా చెప్పింది మా ఆవిడ.

'భగవాన్! మా ఆవిడ బుర్రను ఆ పాడు చీరలపై నుండి ఎంత కాలానికి మార్చావయ్యా. అందుకే కాబోలు హిందూ మహా సముద్రంలో భూకంపం వచ్చి తూర్పు ఆసియా దేశాలకు అంత పెద్ద త్సునామీ వచ్చింది. ఏమైతేనేం సాయంత్రం ఆఫీసు నుండి రాగానే నీకో టెంకాయ కొట్టుకుంటాను స్వామీ' అని మనసులోనే దేవుడికి దణ్ణం పెట్టుకున్నాను.


మా ఆవిడ మాటలు నాకంత ఆనందాశ్చర్యాలు కలగడానికి కారణం చెప్పాలంటే చాలా వుంది.

మా ఆవిడకు చీరలంటే ఎంత వ్యామోహమంటే గబుక్కున దేవుడు ప్రత్యక్షమై "ఏం కాంతమ్మా! నీకు ప్రాణం కావాలా? లేక కొత్త చీర కావాలా?' అని అడిగితే అది ఖచ్చితంగా "నాకు చీరే కావాలి స్వామీ. హాయిగా కొత్త చీర కట్టుకున్నాక ప్రాణం కావాలంటే పట్టుకుపొండి" అని చెప్తుంది.

మా విషయానికొస్తే నాకు నా ఒంటిపైనున్న జత, ఇందాక ఉతకడానికి వేసిన జత, ఇక బీరువాలో ఓ జత... మొత్తం మూడంటే మూడే జతలున్నాయి. ఇక పిల్లలిద్దరికీ చెరో రెండు జతల స్కూలు యూనిఫాంలు, ఇంటి దగ్గర వేసుకోవడానికి చెరో రెండు జతల ఖరీదు తక్కువ డ్రస్సులు, ఎక్కడికైనా తీసుకువెళ్లేప్పుడు వేసుకునేందుకు చెరో రెండు జతల ఖరీదైన డ్రెస్సులు ఉన్నాయి అంతే. మా ఆవిడ విషయానికొస్తే ఇంట్లో ఉండే రెండు బీరువాలూ ఆవిడ చీరలకే సరిపోయాయి. అంతేకాక ట్రంకుపెట్టెలు రెండింటిలోనూ, పెళ్లయిన కొత్తల్లో కొన్న అరిస్టోక్రాట్ సూట్‌కేసులోనూ కూడా ఆవిడ చీరలే వున్నాయి. అవి చాలడంలేదు... మరో బీరువా కొనమని ఆర్నెల్లుగా ప్రాణం తోడేస్తోంది.

చీరల బిల్లులకే జేబులు ఖాళీ అవుతుంటే ఇక కొత్త బీరువా ఏం కొనగలను? ఆ మాటా ఈ మాటా చెప్పి ఎలాగో తప్పించుకుని వస్తున్నాను.

ఆవిడ వారానికోసారి చీరలు ఇంటినిండా పరిచి నాకు చూపించేది. అంతేకాక ఇవి రోజూ కట్టేవి, ఇవి ఎప్పుడైనా కట్టేవి, ఇవి అకేషనల్‌గా కట్టేవి, ఇవి వారానికోసారి తలంటి పోసుకున్నప్పుడు కట్టేవి, ఇవి మంత్లీవి, ఇవి క్వార్టర్లీవి, ఇవి పెళ్లిళ్లకు వెళ్లినప్పుడు కట్టేవి, ఇవి బర్త్‌డే, బారసాలవంటి ఫంక్షన్లకు కట్టేవి అని వివరించి చీరలను డివైడ్ చేసి బీరువాలోనూ, ట్రంకు పెట్టెలలోనూ, సూట్‌కేసులలోను విడివిడిగా సర్దేది. ఆ చీరల పేర్లు కూడా విచిత్రంగా ఉంటాయి నాకు. మొదట్లో ఆర్గండీ చీరలు, ఆఫ్‌వాయిల్ చీరలు, జార్జెట్ చీరలు, గార్డెన్ చీరలు లాంటివి కొన్నది. ఆ తరువాత డిస్కో చీరలు, పూనమ్ చీరలు, కరిష్మా చీరలు కొన్నది. ఈమధ్య సినిమా పేర్లతో చీరలు వస్తున్నాయి. ఇంద్ర చీరలు, ఠాకూర్ చీరలు, శంకర్‌దాదా చీరలు, అడవిరాముడు చీరలు, శివమణి చీరలు... ఇలా వస్తున్నాయి. ఈ బట్టల వ్యాపారులు ఆడవాళ్ల వీక్నెస్‌ను ఎం అందంగా క్యాష్ చేసుకుంటున్నారో అనిపిస్తుం నాకు ఒళ్ళు మండిపోతున్నా చిరునవ్వుతో భరి చక తప్పింది కాదు. పిల్లలకు, నాకు సంవత్సరాని తలా ఓ డ్రెస్సు తీసుకోగలిగితే ఎక్కువ. ఆవి మాత్రం ఏ పండుగను, ఏ సందర్భాన్ని పోని కుండా నెలకొకటో రెండో కొత్త చీరలు కొనేసు వుంటుంది. అదీ ఏడెనిమిది వందలకు తక్కు కాకుండా కొంటుంది. నెలవారీ పద్దులో ఉప్పు పప్పు సామాన్లు, బియ్యం, ఫాన్సీ ఐటమ్స్ లాంటి ఎలా తప్పించుకోలేమో నేను మా ఆవిడ చీర పద్దులనూ అలాగే తప్పించుకోలేకపోతున్నాను. మా ఆవిడ బలహీనతను మాచక్కగా కనిపెట్టినట్లున్నాడు బట్టల కొట్టువాడు. కొత్త మోడల్ చీర దిగీ దిగక ముందే నాలుగైదు డిజైన్లు కుర్రాడి చేత మా ఇంటికే పంపించేస్తున్నాడు. మా ఆవిడ వాటిలో కనీసం ఒకటో రెండో చీరలు ఏరుకుని బిల్లు నా మొహాన కొడుతుంది. ఇక నాకు చచ్చినట్లు వాయిదాల పద్ధతిలో వాడికి బిల్లు పే చేయక తప్పదు. కాదంటే మా ఆవిడ మౌన యుద్ధం ప్రకటిస్తుంది.



అంతేకాక కావాలని కూరల్లో ఉప్పు కారం ఎక్కువ వేయడమో, లేక అస్సలు వేయకపోవడమో చేస్తుంది. అంతేకాక పప్పు ఉడక్కుండానో, కాయగూరలు వాడకుండానో వండి మా దుంప తెంచుతుంది. అదీ కాకుండా ఆఫీసుకు టైమయిపోతున్నా 'వంట ఇంకా పూర్తి కాలేదు, ఈ రోజుకెలాగో కానిచ్చేయండి' అంటుంది. నావద్ద హోటల్‌కు వెళ్లేంత డబ్బు ఎప్పుడూ ఉండదు. అలాగని లంచ్ కోసం ఫ్రెండ్స్‌ను అర్థించలేను. దాంతో మధ్యాహ్నం ఓ సాల్ట్ బిస్కెట్ తిని టీ నీళ్లు తాగి సాయంత్రం అయ్యేసరికి నీరసంతో మొహం వేలాడేసుకుని కొంపకు చేరాలి. అప్పుడు నా భార్య మొహంలో కనిపించే విజయగర్వం 'నాతో పెట్టుకుంటే అంతే మరి' అన్నట్లుంటుంది. అందుకే బట్టల కొట్టువాడ్ని మనసులోనే తిట్టుకుంటూ బిల్లు పే చేస్తుంటాను. ఆవిడ చీరలకీ జీతంలో నాలుగోవంతు ఖర్చవుతుంటే ఇక నేను, పిల్లలు ఏం కొనుక్కోగలం! విధిలేక ఉన్నవాటితోనే సర్దుకుపోతున్నాం. పిల్లలిద్దరూ మొగపిల్లలు అవడంవల్ల సరిపోయిందిగానీ లేకుంటే వాళ్ల పెళ్లిళ్లకు కట్నం డబ్బుల కోసం సినిమాల్లో చూపించినట్లు రిక్షా తొక్కి సంపాదించాల్సి వచ్చేది. అటువంటిది నా భార్య ఈసారి పండక్కి కొత్త చీర కొనవద్దంటే మరి ఆశ్చర్యం వేయదా మరి! అంతలోనే మరో అనుమానం కలిగింది.

"కాంతం... ముందుగానే కొని వుంచావా కొత్త చీరను?" అనుమానంగా అడిగాను.

"అబ్బే లేదండీ. అయినా నాకు బోలెడన్ని చీరలు ఉన్నాయి. కొన్నయితే ఇంకా ఒక్కసారి కూడా ఉతుకుపడని చీరలున్నాయి. అందుకే వాటిలో వేటినైనా పండక్కి కట్టుకోవచ్చు.



పాపం మీకు, పిల్లలకు బొత్తిగా లేవుకదా. అందుకే ఈసారి మీరు కొనుక్కోండి."

"ఇన్నాళ్లకు ఎంత దయ కలిగిందే కాంతం మా మీద నీకు" నా గొంతులో నాకు తెలియకుండానే వ్యంగ్యం ధ్వనించింది.

"అంతేకాదండోయ్... ఇంకో రెండు మూడు సంవత్సరాలపాటు చీరలు కొనదలచుకోలేదు. చీరలంటేనే విసుగెత్తుకొచ్చింది" అంది.

"ఏమయిందే కాంతం నీకు?" నా గొంతు స్వల్పంగా వణికింది. ఆ ప్రశ్నకు ఆమె నుండి చిరునవ్వే సమాధానంగా ఎదురైంది. 'పెరుగుట విరుగుట కొరకే అన్న మాట నిజమే' అనుకున్నాను.

★★★

ఆఫీసుకు వెళ్లేటప్పుడు కేరియర్ అందిస్తూ "మీకిష్టమని ముద్దపప్పు, గుత్తివంకాయకూర చేసాను. డబ్బాలో విడిగా గుమ్మడికాయ వడియాలు, ఊర మిరపకాయలు పెట్టాను" అంది.

గుమ్మం వరకు వచ్చి సాగనంపుతూ "పెందరాళే వచ్చేయండి" అంది. అంతటి సంతోషాన్ని తట్టుకోవడం కూడా కష్టమే అనిపించింది నాకు. అయినా ఆఫీసు అయిపోగానే ఇంటికి చేరకుండా ఎక్కడకు పోగలను?

ఎక్కడకు వెళ్లాలన్నా జేబులో ఎమ్ విటమిన్ ఉండాలి. నాలాంటి మధ్య తరగతి వాడి దగ్గర బహు స్వల్పంగా ఉండే విటమిన్ కదా అది. అయినా మా ఆవిడ అలా ప్రేమగా అనేసరికి మరేం మాట్లాడక "ఊ..." అని తల ఊపి ఆఫీసుకు బయలుదేరాను.

★★★

ఆ రోజంతా నా మనసు గాలిలో విహరించినట్లుగా ఉంది. సాయంత్రం ఇల్లు చేరిన నాకు మా ఆవిడ గడపలోనే ఎదురైంది.

నన్ను చూసి టూత్‌పేస్ట్ అడ్వర్‌టైజ్‌మెంట్‌లో అమ్మాయిలా చిరునవ్వు నవ్వింది. ఎందుకో నా ఎడమ కన్ను అదిరింది.

లోపలికొచ్చాక నా భార్య లుంగీ అందించింది. వేడి వేడి కాఫీ గ్లాసు అందించింది.

కాఫీ చప్పరిస్తుంటే నా పక్కనే కూర్చుంటూ "ఏమండీ... నన్ను గమనించారా?" అంది.

"పదేళ్ళుగా గమనిస్తూనే వున్నానుకదే" అన్నాను.

"ఆ గమనించడం కాదండీ. నావైపు ఓసారి చూడండి" అంది గారంగా.

ఆవిడవైపు పరిశీలనగా చూసాను. మెడలో తళుక్కున మెరుస్తూ నెక్లెస్.

"జస్ట్ టెన్ థౌజండ్ అండీ. త్రీ ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లించవచ్చు" అంది మా ఆవిడ తన మెడలో నెక్లెస్‌వంక మురిపెంగా చూసుకుంటూ.

హతాశుడినయ్యాను నేను.

★